

తక్కువ కాలంలోనే కాంగ్రెస్‌పై వ్యతిరేకత

● ఎంపీ, బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 13: తక్కువ కాలంలోనే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని ఎంపీ, ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం నగరంలో ఏర్పాటు చేసిన బూత్ విజయ్ సంకల్ప్ అభియాన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలుకేంద్రాల్లో ధాన్యం నిల్వలు పోసి ఎదురు చూస్తున్నారన్నారు. కనీస మద్దతు ధరతోపాటు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. తాలు, తరుగు పేరుతో రైతులను దోచుకునేందుకు దళారులు సిద్ధమైనా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దొంగ హామీలతో మోసం చేసిన కాంగ్రెస్‌ను రద్దు చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. కరీంనగర్ అభివృద్ధి కోసం తాను చేసిన పనులపై ప్రొగ్రెస్ రిపోర్టును ముద్రించానన్నారు. కరీంనగర్ పార్ల మెంట్ పరిధిలో 12 వేలకోట్లతో అభివృద్ధినిధులు తీసుకు వస్తే అబద్ధాలు చెబుతూ తామే తెచ్చామంటున్నారన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రజల కోసం చేసిందేమిటని ప్రశ్నించారు. రెండు పార్టీలు చీకటి ఒప్పందాలతో ఒక్కట య్యాయన్నారు. మోదీ నేతృత్వంలో 400 ఎంపీ సీట్లు గెలువబోతున్నామన్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలను ప్రశ్నిస్తుంటే ఇక్కడున్న మంత్రి పొన్నం ప్రభాకర్ అడ్డగోలుగా మాట్లాడుతూ శ్వేతపత్రం ప్రకటించాలంటున్నాడన్నారు. తానుచేసిన అభివృద్ధి పనులన్నింటిని బుక్ లెట్ ముద్రించి ఇంటింటికి పంపిణీ చేశానన్నారు. కాంగ్రెస్ నాయకులు గత ఐదేళ్లలో ఏనాడైనా ఉద్యమాలుచేశారా అని ప్రశ్నించారు. దేశంలో బీజేపీ 370 అర్టికల్ రద్దుచేసి కాశ్మీర్‌కు స్వాతంత్ర్యం కల్పించింద న్నారు. బీజేపీ రామ మందిరాన్ని నిర్మించిందన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ వాళ్లు రాముడి కోసం ఏనాడైనా కరో‌సేవ చేశారా అనిప్రశ్నించారు. హిందు ధర్మ రక్షణ కోసం నిరంతరం పోరాడుతున్నది బీజేపీ మాత్రమేనన్నారు. కరీంనగర్ ప్రజలు నన్ను గెలిపిస్తే మోదీకి ఓటేసి ప్రధానిని చేసుకుందామన్నారు. కార్యకర్తలంతా ఇంటింటికి వెళ్లి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.


బూత్ విజయ్ సంకల్ప అభియాన్ సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్



కాంగ్రెస్ అభ్యర్థి తేలేది నేడే

● హైదరాబాద్‌లో నేతల భేటీ
● సాయంత్రానికి ప్రకటించే అవకాశం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ పార్టీ తన కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ అభ్యర్థి ఎవరో ఆదివారం ప్రకటించే అవకాశం ఉన్నది. నామినేషన్ల ఘట్టం ప్రారంభం కావడానికి మరో నాలుగు రోజులు మాత్రమే ఉండడడంతో ఆ పార్టీ పెద్దలు తెలంగాణలో మిగిలిపోయిన మూడు స్థానాలకు ఆదివారం అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిసింది. కరీం నగర్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు, ప్రవీణ్‌రెడ్డి పేర్లు పరిశీలనలో ఉండగా, రాజేందర్‌రావుకే అభ్యర్థిత్వం దక్కే అవకాశం ఉందని తెలుస్తున్నది. రెడ్డి సామాజిక వర్గం అభ్యర్థుల సంఖ్య ఇప్పటికే ఎక్కువ కావడంతో ప్రవీణ్‌రెడ్డికి టికెట్ ఇవ్వడం లేదని సమాచారం. ఈ నెల 13న ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుని కరీంనగర్ అభ్యర్థి పేరును ప్రకటిస్తారని ప్రచారం జరిగింది. తెలం గాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ హైదరాబాద్‌లోనే ఉండడంతో రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న మూడు స్థానాల అభ్యర్థుల విషయంలో చర్చించ లేదని సమాచారం. ఆదివారం దీపాదాస్ మున్షీ కరీం నగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీకి వ్యతిరేకంగా చేపడుతున్న దీక్షలో పాల్గొంటారు. ఆమె సాయంత్రానికి హైదరాబాద్ తిరిగి వెళ్లిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కమిటీ సభ్యులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రోహిత్‌చౌదరి, తదితర కమిటీ సభ్యులతో సమావేశమై తెలంగాణ పెండింగ్ అభ్యర్థుల గురించి మరోసారిచర్చించి తుదిజాబితా ప్రకటిస్తారని సమాచారం.

● ప్రచారానికి నెల రోజులే సమయం

ప్రచారానికి కేవలం నెల రోజులు మాత్రమే మిగిలి ఉండడం బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులు నెల రోజులుగా నియోజక వర్గ పరిధిలోని అసెంబ్లీ నియోజక వర్గాలలో రెండేసి సార్లు పర్యటించి సమావేశాలు నిర్వహించడం అన్ని హంగులు సమకూర్చుకోవడం పూర్తి చేశారు. అభ్యర్థిని ఆదివారం ప్రకటించినా అన్ని వ్యవస్థలు సమకూర్చుకోవడానికి వారం రోజులు పడుతుందని కేవలం 20 రోజులు మాత్రమే ప్రచారానికి మిగిలి ఉంటుందని ఆశావహులు ఆందోళన పడుతున్నారు. అధిష్ఠానం ఆఖరి క్షణం వరకు నాన్చుతూ వచ్చి తమను పోటీ చేయమని పేర్లు ప్రకటిస్తే ఏం లాభమనే అభిప్రాయాన్ని కూడా ఆశావహులు వ్యక్తం చేస్తున్నారని తెలుస్తున్నది. అధిష్ఠానం చేస్తున్న జాప్యం పట్ల పార్టీ నేతలు, శ్రేణులు కూడా అగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నెల రోజుల వ్యవధిలో ప్రజలను కలవడం సాధ్యమవుతుందా ప్రచారం పూర్తి చేయగలుగుతామా అంటు వారు అనుమానాలు వ్యక్తం చేస్తుండడంతో టికెట్ ఆశిస్తున్న వారు డీలా పడుతున్నారని సమాచారం.

అకాల వర్షంతో రైతుల ఆందోళన

● ధాన్యాన్ని కాపాడుకునేందుకు అష్టకష్టాలు

గంగాధర, ఏప్రిల్ 13: యాసంగి కోతల ఆరంభంలోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా వాతావరణ మార్పులు, రెండురోజులుగా అకాల వర్షంతో రైతులను కలవరానికి గురి చేస్తోంది. గంగాధర మండల వ్యాప్తంగా వారం క్రితం నుంచే వరి కోతలు ప్రారంభమయ్యాయి. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అధికారులు ఆరిన ధాన్యాన్ని తూకం వేయడంలేదు. మూడేళ్లుగా బీహార్ హమాలీలతో కేంద్రాల్లో తూకం వేయిస్తుండగా ఈసారి వారి జాడలేదు. మరో వైపు రెండు రోజులుగా కురుస్తున్న జల్లులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో లేక బయట కిరాయికి తీసుకువచ్చి ధాన్యం తడవకుండా కప్పుతున్నారు. జల్లులు కురుస్తుండడంతో పొలాల్లో తేమతో వరి కోతలు ముందుకు సాగడంలేదు. మరో వైపు కిరాయి ఎక్కువైన పరవాలేదని చైన్ మిషన్‌తో పొలాలు కోయిస్తున్నారు. వర్షం పడితే గింజలు రంగుమారి ధర తక్కువ వచ్చి నష్టపోయే అవకాశముందని రైతులు వాపోతున్నారు. పంట ప్రారంభం నుంచి పెట్టుబడికి, సాగునీటికి వేల ఖర్చు తడిసి మోపడైందన్నారు. పెట్టుబడి పెరిగిన సమయంలో దిగుబడులు, ధరలు బాగుండగా ఎంతో కొంత చేతికొస్తుందనుకున్న తరుణంలో అకాల వర్షం రైతులను ఆందోళనకు గురి చేస్తుంది. కేంద్రాల్లో రైతులకు సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచి తూకం ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.


నాగిరెడ్డిపూర్ కేంద్రంలో వర్షానికి తడవకుండా ధాన్యం కుప్పలపై రైతులు కప్పిన టార్పాలిన్లు

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనాలి

● కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 13: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్, బద్దిపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీస మద్దతు ధర కల్పించాలని, తక్కువ ధరకు ధాన్యం కొంటే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు నిర్దేశిత తేమ శాతం వచ్చే విధంగా ధాన్యాన్ని ఆరబెట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తరుగు, తేమ శాతం పేరిట ధాన్యానికి కోతలు విధించవద్దని తెలిపారు. రైస్‌మిల్లర్లు ధాన్యం విషయంలో ఎలాంటి ఇబ్బందులు పెట్టవద్దన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా రైతులు తమ దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తామన్నారు. కేం ద్రాల్లో ప్యాడీక్లీనర్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. హమాలీలు, రైతుల కోసం తాగునీరు, విశ్రాంతి తీసుకునేందుకు వసతి కల్పించా లన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డీఎం రజనీకాంత్, డిప్యూటి తహసీల్దార్ సురేందర్, ఆర్‌ఐ అరుణ్, అధికారులు పాల్గొన్నారు.


మల్కాపూర్‌లో కొనుగోలుకేంద్రంలో రైతులతోమాట్లాడుతున్న కలెక్టర్

● విశ్రాంతి తీసుకునేందుకు షెడ్డు నిర్మించండి

మల్కాపూర్ కొనుగోలు కేంద్రంలో విశ్రాంతి తీసుకునేదుకు షెడ్డు నిర్మించాలని రైతులు వినతి పత్రం అందించారు. కొనుగోలు కేంద్రంలో టారాలిన్లు, తాగునీటి వసతి, రైతు విశ్రాంతి భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, పండుగ లక్ష్మీపతి, కాంతాల జగన్‌రెడ్డి, పల్లె జితేందర్, జక్కు లచ్చయ్య, పల్లాటి శంకరయ్య, దావీదు, లక్ష్మి, రాజు, మనోహర్ పాల్గొన్నారు.


కత్తులతో విన్యాసాలు ప్రదర్శిస్తున్న సిక్కు మతస్తులు

ఘనంగా ఖల్సా ఆవిర్భావ దినోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 13: కరీంనగర్‌లోని సిక్‌వాడీలో గురు ద్వారా ప్రబంద్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం (వైశాఖి) ఖల్సా ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. సిక్కులు నగర వీధుల్లో మత గురు వులతో కలసి భక్తి పార వశ్యంతో శోభాయాత్ర జరిపారు. ఈ సందర్భంగా సిక్కు మతస్తులు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకు న్నాయి. కార్యక్రమంలో జీపీసీ అధ్యక్ష కార్యదర్శులు సర్దుల్‌సింగ్, బిషన్ సింగ్, సభ్యులు రణబీర్‌సింగ్, బల్బీర్‌సింగ్ పాల్గొన్నారు.


శోభాయాత్రలో పాల్గొన్న సిక్కు మత గురువులు

'డంపింగ్ యార్డును తరలించాలి'

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13: కరీంనగర్ కాలుష్య కోరల్లో చిక్కుకుందని, డంపింగ్ యార్డును తరలించాలని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మామిడాల మనోహర్ కోరారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సౌత్ ఇండియా చైర్మెన్ డాక్టర్ జి హన్మగౌడ్, రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ నోముల సంపత్‌గౌడ్‌తో కలిసి డంపింగ్ యార్డును సందర్శించామని తెలిపారు. డంపింగ్ యార్డులో అధికంగా చెత్తను డంప్ చేయడం దానికి నిప్పు పెట్టడం వల్ల మంటలు, పొగ వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చెత్తను పునర్వినియోగం చేయాలని, లేదంటే డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. చెత్తకు నిప్పు పెట్టడం వల్ల రహదారి మొత్తం పొగతో కమ్ముకుపోయి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. పొగ వల్ల డంపింగ్ యార్డు సమీప ప్రాంతాల్లో నివసించే పలువురు కళ్లమంట, ఊపిరితిత్తుల సమస్యలతో ఆసుపత్రుల పాలవుతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి డంపింగ్ యార్డును తరలించాలని, లేకపోతే మానవహక్కుల కమీషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చ రించారు. సమావేశంలో మహిళ విభాగం చైర్‌పర్సన్ రాజేశ్వరి, వైస్ చైర్మన్ వెంకటరామకృష్ణ పాల్గొన్నారు.

నేడు డీసీసీ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ దీక్ష

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 13 : కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని నిరసిస్తూ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డీసీసీ కార్యాలయంలో దీక్ష చేపట్టనున్నారని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉద యం 11 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు ఈ దీ క్ష ఉంటుందని చెప్పారు. దీక్షలో మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలతోపాటు ఉమ్మడి జిల్లాలోని నియోజకవ ర్గ ఇన్‌చార్జిలు, నాయకులు పాల్గొంటారని తెలిపారు.



నేడు హుస్నాబాద్‌లో బీజేపీ నిరసన దీక్ష

భగత్‌నగర్, ఏప్రిల్ 13: ఆరుగ్యారెంటీల అమలులో జాప్యానికి నిరసనగా ఆదివారం హుస్నాబాద్‌లో బీజేపీ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టనున్నట్లు బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం కరీంనగర్‌లో హుస్నాబాద్ నియోజక వర్గనాయకులతో సమావేశమై దీక్షపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు హుస్నా బాద్‌లోని బొమ్మ శ్రీరాం చక్రవర్తి కార్యాలయంలో నిరసన దీక్ష చేపడుతు న్నామన్నారు. ఆరుగ్యారెంటీలు అమలుచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నివర్గాల ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, రాంగోపాల్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 13: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లతోపాటు సంక్షేమ రంగానికి సంబంధించిన మెస్ బిల్లుతో పాటు డైట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ఓ డిగ్రీకళాశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాజన్న సిరిసిల్ల జిల్లా మూడో మహాసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జెండాను జిల్లా అధ్యక్షుడు మంద అనిల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజనీకాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టల్‌లకు సంబంధించిన డైట్ చార్జీలు విడుదల చేయకపోవడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను మూడువేల రూపాయలకు పెంచాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుంచి ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రి లేకపోతే సమస్యలపై ఏవిధంగా చర్చిస్తారన్నారు. పెండింగ్‌లో ఉన్న 7,800కోట్ల రూపాయల స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేయడంతోపాటు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకురావాలన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్, రాకేష్, సహాయ కార్యదర్శి కళ్యాణ్, అనూష తదితరులు పాల్గొన్నారు.



అపర భద్రాద్రికి బ్రహ్మోత్సవ శోభ

- సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం
- రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించనున్న కలెక్టర్ పమేలా సత్పతి
- రేపటి నుంచి ఉత్సవాలు ప్రారంభం

ఇల్లందకుంట, ఏప్రిల్ 13: మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఈ నెల 15 నుంచి 27వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 17న శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహిం చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయ చరిత్ర రామాయణంతో ముడిపడి ఉంది. త్రేతాయుగంలో రాముడు, లక్ష్మణుడు, సీతా అరణ్య వాసం చేస్తూ ఇక్కడ సేద తీరుతన్న సమ యంలో తన తండ్రి దశరథ మహరాజు మరణ వార్త తెలిసింది. ఇక్కడి ఇల్లంద వృక్షం పలుకులతో శ్రీరాముడు తన తండ్రికి శ్రాద్ధకర్మలు జరిపించారని ఆలయ పూజారులు చెబుతారు. అప్పటి నుంచి ఈ గ్రామానికి ఇల్లందకుంట అని పేరు పెట్టారు. ఇల్లందకుంట ఆలయంలో సీతారామచంద్రులను పుట్టు దేవుడిగా అభివర్ణిస్తారు. ఆలయ ఉత్సవ మూర్తులకు పుట్టు మచ్చలు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. రాముడు అరణ్యవాసంలో భాగంగా ఇక్కడ 13 రోజులు ఈ పరిసర గ్రామాల్లో సంతరించాడని పెద్దలు చెబుతారు. అందుకే ఈ గ్రామాల పేరు లక్ష్మాజిపల్లె, శ్రీరాములపల్లె, సీతంపేట, సిరిసేడు, లక్ష్మన్నపల్లెగా ఉన్నాయి. ఈ నెల 15నుంచి 27వరకు జరగనున్న బ్రహ్మో త్సవాలను భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగ కుండా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ అభిషేక్ మొహంతి, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయ కార్యానిర్వాహణాదికారి కందుల సుధాకర్ పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. హుజూ రాబాద్ ఆర్డీవో రమేష్‌బాబు, ఏసీపీ శ్రీనివాస్‌జీలు స్థానిక అధికారులచే సమీక్ష సమావేశాలు నిర్వహించారు.


శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు

● లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

బ్రహ్మోత్సవాలకు సుమారు లక్షకుపైగా భక్తులు హాజరు కానున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు (శ్రీరామనవమి రోజు) జమ్మికుంట కాటన్, రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్య సదుపాయం అందించేందుకు 108, 104 వాహనాలను అందుబాటులో ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ శ్రీనివాస్‌జీ, జమ్మికుంట రూరల్ సీఐ కోరె కిశోర్, ఎస్ఐ రాజకుమార్‌ల భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఆలయ పరిసరాల్లో 18 సీసీ కెమెరాలు అమర్చారు.

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం.

- కందుల సుధాకర్, ఆలయ ఈవో, ఇల్లందకుంట



దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి.

బ్రహ్మోత్సవాల వివరాలు

- 15న సోమవారం రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తుల బాహ్యామందిర ప్రవేశం
- 16న మంగళవారం సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ
- 17న బుధవారం ఉదయం 9గంటలకు ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ట, ఉదయం 10 గంటలకు ఎదుర్కోళ్లు, మధ్యాహ్నం 12 గంటలకు శ్రీసీతారాముల కల్యాణం, రాత్రి 9 గంటలకు శేషవాహన సేవ
- 18న గురువారం ఉదయం 10 గంటలకు పట్టాభిషేకం, సువర్ణ పుష్పార్చన, సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం ప్రారంభం
- 19న శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం, రాత్రి 9 గంటలకు గరుడవాహన సేవ
- 20న శనివారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం, రాత్రి 9 గంటలకు హనుమత్ వాహన సేవ
- 21న ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం, రాత్రి 9 గంటలకు గజవాహన సేవ, అనంతరం సదస్యం, వేదాశీర్వచనం.
- 22న సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం ముగింపు, రాత్రి 9 గంటలకు అశ్వవాహన సేవ, దోపోత్సవం.
- 23న మంగళవారం సాయంత్రం 6 గంటలకు శకటోత్సవం, రాత్రి 7గంటలకు సూర్య రథోత్సవం (చిన్నరథం)
- 24న బుధవారం సాయంత్రం 7గంటలకు స్వామివారు చంద్రరథోత్సవం (పెద్దరథం) మీదకు వస్తారు.
- 25న గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులకు స్వామివార్ల దర్శనం, సేవల అనంతరం తిరుమాడ వీధుల్లో చంద్రరోథత్సవం (పెద్దరథం) ఊరేగింపు. రాత్రి 7గంటలకు మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ
- 26న శుక్రవారం ఉదయం 9గంటలకు అష్టోత్తరశత (108) కలశాభిషేకం, అవబృథ చక్రస్నానం. రాత్రి 9గంటలకు ద్వాదశారాధన, శ్రీపుష్పయాగం (నాఖబలి)
- 27న శనివారం రాత్రి 7గంటలకు సప్త వరణాలు, ఏకాంతసేవ

గంజాయిపై ఉక్కుపాదం

- ఐదుగురు విక్రయదారుల అరెస్టు
- రెండు కిలోల గంజాయి సీజ్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



మాట్లాడుతున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 13: గంజాయి రవాణా, వినియో గంపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి అన్నారు. వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. వేములవాడ పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న ఐదురుగురిని అరెస్టు చేసి వారి వద్దనుంచి రెండు కి లోల గంజాయిని స్వాధీనపరచుకుని సీజ్ చేశామన్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్యామ్ దివాకర్, వేములవాడ పట్టణానికి చెందిన మల్లికార్జున్, కామారెడ్డికి చెందిన కట్కూరి భాను, మంచిర్యాలకు చెందిన పరికిపండ్ల అన్వేష్ అలియాస్ బన్ని, వేములవాడ పట్టణం సుభాష్‌నగర్‌కు చెందిన మర్రిపల్లి సురేష్ అనే విక్రయదారుల నుంచి గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న మరికొందరు పరారీలో ఉన్నారని వారిని కూడా త్వరలో పట్టుకుంటామని తెలి పారు. గంజాయి మహమ్మారిని తరమికొట్టడంలో భాగంగా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. వేములవాడ ప్రాంతంలో గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రజలు సహకరిం చాలన్నారు. గంజాయి విక్రయించినట్లు తెలిసినా, గంజాయి ని సేవిస్తున్నట్లు తెలిసినా పోలీసులకు సమా చారం అం దించాలని లేదా 100కు డయల్ చేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో చురుకుగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు రాజశేఖర్, తిరుపతి, శంకర్, గోపాల్, సతీష్‌లకు డీఎస్పీ నాగేంద్రచారి రివా ర్డులను అందజేసి అభినందించారు. సమావేశంలో రూరల్, పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్సై మారుతి, టౌన్ ఎస్సై అంజ య్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ కౌన్సిల్ సభ్యుల తనిఖీలు

- 8 క్లినిక్‌లపై కేసులు


నిర్వాహకుడిని వివరాలను అడుగుతున్న డాక్టర్ సురేష్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 13: తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ బృందం వైద్యులు డాక్టర్ సరేష్, డాక్టర్ రితేష్, డాక్టర్ గౌతం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో పలు క్లినిక్‌లపై ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. చాలా చోట్ల అనుమతులు లేకుండా ఆర్‌పీలు డాక్టర్లమంటూ ప్రచారం చేసుకుంటూ వైద్యం చేస్తున్నారని వారి తనిఖీల్లో తేలింది. కొందరు బెడ్లు కూడా ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నట్లు తనిఖీ బృందం గుర్తించింది. జిల్లా కేంద్రంలోని గోదాంగడ్డలోని వేంకటేశ్వర వైద్యాలయం, హెవెన్లీ క్లినిక్, హెల్త్‌కేర్ క్లినిక్, రాంనగర్‌లోని లక్ష్మి, సాయిరాం, కావ్య క్లినిక్‌లతో పాటు అర్ని క్లినిక్, సాయిరాం, లలిత పాలి సెంటర్లను తనిఖీ చేశారు. ఇందులో అర్ని క్లినిక్ మినహా మిగతా క్లినిక్‌లన్నీ అర్హత లేకుండా నిర్వహిస్తున్నారని, వారిపై కేసు నమోదు చేసినట్లు డాక్టర్ నరేష్ తెలిపారు. చింతకుంట క్రాస్ రోడ్‌లోని సాయిరాం నర్సింగ్ హోం, లలిత పాలీ సెంటర్, అర్ని క్లినిక్‌లలో అర్హత గల డాక్టర్లు ఉన్నప్పటికీ నర్సింగ్ హోం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు తీసుకోకపోవడంతో వాటికి అనుమతులు తీసుకోవాలని నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. మిగతా క్లినిక్‌ల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు వారు తెలియచేశారు. అర్హత లేకున్నా యాంటిబయాటిక్స్ మందులు రాస్తున్నారని, స్టెరాయిడ్స్ ఇస్తు న్నట్లు తమ తనిఖీల్లో తేలిందన్నారు.

వంతెన నిర్మాణ సామగ్రి చోరీ

ముత్తారం, ఏప్రిల్ 13: మండలంలోని ఓడేడు గ్రామ శివారులోని మానేరుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ సామగ్రి చోరీ జరిగినట్లు సైట్ ఇన్‌చార్జి సయ్యద్ బాబా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, ఏప్రిల్ 13: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం సుదూర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు క్షేత్రానికి తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకుని స్వామిని దర్శించుకు న్నారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చర ణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వ హించారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు

వేములవాడ, ఏప్రిల్ 13: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో రాజరాజేశ్వర స్వామి, సీతారామ చంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. శ్రీరామనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం ఉద యం రాజరాజేశ్వర స్వామివారి కి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రా భిషేకం, సీతారామ చంద్ర స్వామి వారికి పంచోపనిషత్ ద్వారాభిషేకం, పరివార దేవతార్చనలు నిర్వ హించారు. ఉత్సవాలలో భాగంగా సాయంత్రం వేళ లక్ష్మీఅనంతపద్మనాభస్వామి, పార్వతీ రాజరాజేశ్వరస్వామి వార్లను పెద్ద సేవపై ఊరేగించాల్సి ఉండగా, వాతావర ణం అనుకూలంగా లేని కారణంగా పెద్ద సేవను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గోదావరిలో దూకి యువతి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 13: గోదావరిఖనికి చెందిన ఆర్షియా అనే యువతి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బాపూజీనగర్‌కు ఆర్టీసీ ఉద్యోగి అబ్దుల్లా కుమార్తె ఆర్షియా కుటుంబ సమస్యలు, ఆర్థికపరమైన ఇబ్బందులతో శుక్రవారం రాత్రి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. అబ్దుల్లా కుమారుడు నిస్సార్ 2020 అక్టోబరులో గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

రెండు కార్లు ఢీ.. ఇద్దరి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

వనస్థలిపురం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అతివేగం ఇద్దరి ప్రాణా లను బలితీసుకుంది. నిద్రమత్తులో అతివేగంగా కారు నడిపి డివైడ ర్‌ను ఢీకొని ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయా లయ్యాయి. ఈ ప్రమాదం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన బొల్లం ప్రణయ్‌కుమార్(29) ప్రైవేట్ ఉద్యోగి. మీర్‌పేట్‌లోని నందిహిల్స్‌లో ఉంటున్నాడు. ప్రకాశం జిల్లా సంతనూతల మండలం గుడిపాడు గ్రామానికి చెందిన కుంచాల రవీందర్‌బాబు(29) ప్రైవేట్ జాబ్ చేసుకుంటూ వనస్థలిపురం ఎస్‌కేడీ నగర్‌లో ఉంటున్నాడు. వీరి ద్దరూ స్నేహితులు. ఈ క్రమంలో శుక్రవారం అర్ధరాత్రి 2.30 గంట లకు స్విఫ్ట్ కారు(టీఎస్22టీఏ 0898)లో తుర్కయాంజాల్ నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వస్తున్నారు. అదేసమయంలో నల్గొండ జిల్లా మల్లేపల్లి సమీపంలోని వడ్డెమోనిగూడెం తండాకు చెందిన ఇస్లావ త్ దస్రు(26)తన క్రేటా కారు(టీఎస్05ఈసీ0123)తో బీఎన్‌రెడ్డినగర్ నుంచి తుర్కయంజాల్ వైపు వెళ్తున్నాడు. గుర్రంగూడ చౌరస్తా దాటిన తర్వాత నిద్రమత్తులో అతివేగంతో డివైడర్‌ని ఢీకొని అవతలి వైపు నుంచి వస్తున్న స్విఫ్ట్ కారును ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో స్విఫ్ట్ కారు లోని బొల్లం ప్రణయ్ కుమార్, కుం చా ల రవీందర్ బాబు తీవ్రంగా గాయపడ్డా రు. సంఘటనా స్థలంలోనే ఇద్దరూ మృ తి చెందారు. ఇస్లావత్ దస్రుకు తీవ్ర గా యాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తర లించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రణయ్‌కుమార్(ఫైల్)

● బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో మరొకరు..

అంతర్గాం: రామగుండం కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ ఏరి యా మల్యాలపల్లి వద్ద రాజీవ్ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చొప్పరి ఓదెలు(41) అనే విలేకరి మృతిచెందాడు. రామగుండం ఎస్సై కే సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పాలకుర్తి మండలం బసంత్‌నగర్ కుర్మపల్లికి చెందిన ఓదెలు తన ద్విచక్ర వాహనంపై గోదావరిఖని వస్తున్నాడు. భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టీఎస్28జెడ్0105) వెనుక నుంచి ఢీకొట్టగా ఓదెలు అక్కడికక్కడే మృతిచెందాడు. ఓదెలుకు భార్య స్వరూప, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓదెలు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సతీష్ తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 13: అగ్నిమాపక నివారణ చర్యల్లో భాగంగా ఈనెల 14నుంచి 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను శనివారం కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా ఆమె కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలపై లోతుగా ప్రజలకు అవగాహన కల్పించాలని అగ్నిమాపక అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కరీంనగర్ డివిజన్ ఫైర్ ఆఫీసర్ తగరం వెంకన్న, ఫైర్ ఆఫీసర్‌లు పరమేశ్వర్, భూదయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బూత్‌స్థాయిలో కార్యకర్తలే హీరోలు

భగత్‌నగర్, ఏప్రిల్ 13: పోలింగ్ బూత్ స్థాయిలోకార్యకర్తలే హీరోలని బీజేపీ జాతీయ సంస్థాగత సహ ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్‌జీ అన్నారు. శనివారం రేకుర్తిలో జరిగిన బూత్ విజయ సంకల్ప అభియాన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల జరిగే నాటికి కార్యకర్తలు ఒక్కో ఇంటికిఐదు సార్లు వెళ్లి ఓటు అభ్యర్థించేలా ప్రణాళికరూపొందించుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఈ సారి కరీంనగర్‌లో ఎంపీగామరోసారి బండి సంజయ్ గెలిచి కేంద్రమంత్రి కాబోతున్నారన్నారు. బీజేపీ గెలుపు ఎప్పుడో ఖాయమైందన్నారు. మొత్తం పోలైన ఓట్లలో 51 శాతం ఓట్లు బీజేపీకి వచ్చేలా కార్యకర్తలుకృషిచేయాలన్నారు. అత్యధిక మెజారిటీతో బీజేపీని గెలిపిచేందుకు కృషిచేయాలన్నారు.

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్సులో సెయింట్ జార్జ్ విద్యార్థికి చోటు

కరీంనగర్‌రూరల్, ఏప్రిల్ 13: ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్సులో సెయింట్ జార్జ్ (సిబిఎస్ఈ) పాఠశాలకు చెందిన ఐదవ తరగతి విద్యార్థి సుశీల్ చోటు సంపాదించాడు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి సుశీల్‌ను అభినం దించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలకాలను అత్యంత వేగంగా 3 నిమిషాల రెండు సెకన్లలో రాసి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించాడన్నారు. ఈ సందర్భంగా విద్యార్థితో పాటు ట్రైనర్ ఫాతిమాను అభినం దించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భార్గవ్, నిరంజన్, కో-ఆర్డినేటర్ వనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విష్ణుసహస్రనామ పారాయణాలు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 13: వసంత నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా శనివారం జ్యోతీనగర్ హనుమాన్ సంతోషిమాత గుడి ప్రక్కన గల ఆంజనేయస్వామి ఆలయంలో వాసవి వాగ్దేవి వనితా క్లబ్ ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, విష్ణు సహస్రనామ పారాయణాలు చేశారు. క్లబ్ అధ్యక్షురాలు మాడిశెట్టి ఉమ మాట్లాడుతూ రాముని జీవితం ఆదర్శ ప్రాయమని, రామనవమి సందర్భంగా ఇలాంటి కార్యక్రమాలు చేయడం అభినందనీయమని అన్నారు. ఆలయ అర్చకుడు రామశర్మను సన్మానించారు. కోలాటం ఆడుతూ, నృత్యాలు చేస్తూ, పాటలు పాడుతూ భక్తి ప్రపత్తులతో గడిపారు. అధ్యక్ష కార్యదర్శులు మాడిశెట్టి ఉమ, స్వరూప ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

'చీకటిపువ్వు' నాటికకు ఉత్తమ ద్వితీయ బహుమతి

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 13: ఈ నెల 9 నుంచి 11 వరకు రావులపాలెం (రాజమండ్రి) లో జరిగిన జాతీయ స్థాయి నాటిక పోటీల్లో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు ప్రదర్శించిన 'చీకటిపువ్వు' నాటికకు ఉత్తమ ద్వితీయ బహుమతితో పాటు ఉత్తమ నటిగా లహరి బహుమతి పొందా రని సంస్థ అధ్యక్షుడు తిప్పర్తి ప్రభాకర్ తెలిపారు. బహుమ తులను సినీ నటుడు తనికెళ్ళ భరణి, సినీ దర్శకుడు వంశీ చేతుల మీదుగా కళాకారులు శనివారం అందుకున్నారు. నాటికలో కొత్తకొండ సత్యనారాయణ, దేవులపల్లి గిరిబాబు, యేపూరి శ్రీనివాస్ నటించగా సంగీతం సురభి నాగరాజు, ఆహార్యం, లైటింగ్ కేదారి నాగు చేశారని దర్శకుడు మంచాల రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా కళాకారులకు పలు కళా సంస్థల బాధ్యులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి సతీమణిని నిలదీసిన మహిళ

మానకొండూర్, ఏప్రిల్ 13 : మండలంలోని చెంజర్ల గ్రామంలో శనివారం కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ సతీమణి మాధవి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ఓ మహిళ నిలదీసింది. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని మాధవి అభ్యర్థించింది. దీంతో మాకు ఏమీ ఇవ్వలేదు అన్నీ ఉన్నోళ్లకే ఇచ్చిండ్రు అని సదరు మహిళ నిలదీసింది.

విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలి



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి

తిమ్మాపూర్, ఏప్రిల్ 13: విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించాలని శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి అన్నారు. వరంగల్ వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిం చిన స్టేట్ లెవల్ క్రికెట్ పోటీల్లో శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాల జట్టు రన్నరప్‌గా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా ట్రోఫీ సాధించిన విద్యార్థులను చైర్మన్ అభినందిం చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి వెంకటేశ్వర్లు, మీడియా ఇన్‌చార్జి రమేశ్, పీడీ సునీత తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామసాయి మానవసేవ చారిటబుల్ ట్రస్టు కార్యవర్గం

ఇల్లందకుంట, ఏప్రిల్ 13: మండల కేంద్రంలోని శ్రీరామసాయి మానవసేవ చారిట బుల్ ట్రస్టు (వృద్ధాశ్రమం) కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా గణపతిరెడ్డి, బాబయ్య, మాధవ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బచ్చు శివకుమార్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా మురికి మహేం దర్, జాయింట్ సెక్రటరీలుగా మధుసూదన్, వై సుధాకర్, దేవదాసు, కమిటీ సభ్యు లుగా రవీందర్, శ్రీనివాస్, తిరుపతి, సురేష్, నాగయ్య, కిశోర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు అనంతరం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో అయిత జనార్దన్, జడల రామలింగం, బచ్చు వీరలింగం, జి రాజమౌళి, డాక్టర్ రాము, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ వృద్ధాశ్రమానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తమ నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

చెల్పూర్, జూపాక గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



జూపాకలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 13: మండలంలోని చెల్పూర్, జూపాక గ్రామాల్లో సీపీ ఆదేశాల మేరకు శనివారం హుజూరాబాద్‌టౌన్ సీఐ బొల్లం రమేశ్ ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. సోషల్ మీడియాలో అభ్యంతర పోస్టులు, మెసెజ్‌లు పంపితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తే ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. సమావే శంలో 20 మంది సీఐఎస్ఎఫ్ ఆఫీసర్స్, జవాన్లు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

'శ్రీపాదరావు అడుగుజాడల్లో నడవాలి'



శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 13: ప్రతి ఒక్కరూ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు అడుగు జాడల్లో నడవాలని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి సూచించారు. శ్రీపాదరావు 25వ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయంలో శనివా రం ఘనంగా నిర్వహిచారు. మొదట డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శ్రీపాదరావు చిత్రపటానికి కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అ ధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్‌లు పూలమాలలు వేసి నివా ళులర్పించారు. అనంతరం అనంతరం నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంలోని బస్టాండ్ కూడ లిలో శ్రీపాద విగ్రహంకు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ఎండీ తాజ్, శ్రావణ్‌నాయక్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీపాదరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసన సభ స్పీకర్‌గా, ఐదు సార్లు ఎమ్మెల్యేగా, అజాతశత్రువుగా అందరి మన్ననలు పొందారన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. మాజీ ఎ మ్మెల్యే ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ శ్రీపాదరావు స్పీకర్‌గా, ఎమ్మెల్యేగా రాష్ట్రానికి ఎనలేని సేవలు చేశారన్నారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్‌పార్టీ నాయకులు వెన్న రాజమల్లయ్య, విక్టర్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, నిహాల్ హైమద్, కాంరెడ్డి రాంరెడ్డి, దన్నా సింగ్, కమ్రొద్దీన్, కుర్ర పోచయ్య, మామిడి సత్యనారాయణరెడ్డి, అబ్దుల్ బారి, దండి రవీందర్, నెల్లి నరేష్, దీకొండ శేఖర్, పోరండ్ల రమేష్, గంగుల దిలీప్, కుంబాల రాజ్‌కుమార్, సలీమొద్దీన్, రోళ్ళ సతీష్, అనిల్‌కుమార్‌గుప్త, కాంతయ్య, ప్రభాకర్, సతీష్‌రావు, లయాక్, శ్రీనివాస్, షహేన్‌షా,ఎజ్రా, అజయ్, మహేష్, మహేందర్‌రెడ్డి, స్వప్న, శివప్రసాద్, దిండిగాల మధు, మూల జైపాల్, కీర్తికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'రామరాజ్యం రావడానికి కృషి చేద్దాం'

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 13: రామరాజ్యం రావడానికి మనమంతా కృషి చేయాలని, పరిపాలకులు మంచివారైతే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్‌స్వామి అన్నారు. జెట్, వికాస తరంగిణీ ఆధ్వర్యంలో క్రోధి నామ నూతన సంవత్సర ఉగాది వేడుకల్లో భాగంగా పద్మనాయక కల్యాణ మండపంలో జరుగుతునన్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో శనివారం ఉదయం, సాయంత్రం స్వామి ప్రవచనం చేశారు. రామాయణంలోని బాలకాండ 6వ సర్గలో పాలకుల విధివిధానాలు, ప్రజల ఆలోచనా సరళి వివరించబడ్డాయని పేర్కొన్నారు. ఉదయం శ్రీమద్రామాయణ హవనం, తీర్థగోష్ఠి, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఇటీవల నూతనంగా పునర్నించిన జ్యోతీనగర్‌లోని ఆండాళ్‌గోష్ఠిని స్వామీజీ సందర్శించి కొబ్బరికాయ కొట్టారు. కార్యక్రమంలో చల్మెడ లక్ష్మీనరసింహరావు, వీర్ల ప్రభాకర్‌రావు, కలకొండ గౌతమరావు, టీవి రావు, యాద కిషన్, ఎల్ భూపతిరావు, ఎస్ వేంకటేశం, వరప్రసాదాచార్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 13 : కాంగ్రెస్ పార్టీ ఐదు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేస్తూ కరీంనగర్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి శనివారం ప్రచారం నిర్వహించారు. ఎస్సారఆర్ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలుస్తూ ఐదు గ్యారంటీల కరపత్రాలను పంపిణీ చేస్తూ కాంగ్రెస్‌పార్టీకి మద్దతును కోరారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో కూడా రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి నాయకత్వంలో ప్రజా పాలన రావల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సుడా ఛైర్మన్‌గా నియామకమైన నరేందర్‌రెడ్డిని ఈ సందర్భంగా వాకర్స్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు కొరివి అరుణ్‌కుమార్, శ్రావణ్‌నాయక్, గన్ను మహేందర్ రెడ్డి, కుర్ర పోచయ్య, బాబుల్ వర్మ, రామ్మూర్తి, మల్లేశం, దేవేందర్, ఊరడి లత, తిరుమల, రజితరెడ్డి, మహాలక్ష్మి, షహేన్‌షా, కీర్తికుమార్, మాసూంఖాన్ పాల్గొన్నారు.

యజ్ఞవరాహక్షేత్రంలో వసంతోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 13: నూతన సంవత్సరంలో ప్రజలకు శుభాలు కలుగాలని, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని క్షేత్ర వ్యవస్థాపకులు, ఆధ్యాత్మికవేత్త, పద్మశ్రీ శ్రీభాష్యం విజయ సారధి స్కాంద పురాణాంతర్గత నవవర్ష జయోత్సవ వ్రతాన్ని ఉద్ధరించారు. ఇందులో భాగంగా క్రోధి నామ సంవత్సరంలో వచ్చే తొలి శనివారాన్ని పురస్కరించుకొని క్షేత్రంలో శనివారం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, అనంతరం స్వామివారికి విశేష ద్రవ్యములతో మహాభిషేకం, అర్చన, నీరాజనం, అన్నప్రసాద వితరణ జరిగాయి. రాత్రి నవవర్ష జయవ్రత దీపోత్సవం, తీర్థ ప్రసాద, అల్పాహార వితరణ చేశారు. కార్యక్రమంలో సర్వవైదిక సంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభలను జయప్రదం చేయండి

భగత్‌నగర్, భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో 15, 16తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కన్వెనర్షన్‌ను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహేందర్, బ్రాహ్మణపల్లి యుగేందర్‌లు ఒక ప్రకటనలో కోరారు.

వైద్యులు వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించాలి



చల్మెడ ఆసుపత్రిలో స్కిల్ మెడికల్ సిమ్యులేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న చిన్నజీయర్ స్వామి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 13: వైద్యులు వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించాలని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి అన్నారు. శనివారం చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో స్కిల్ అండ్ మెడికల్ సిమ్యులేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిన సిమ్యులేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. నైపుణ్యం, వైద్య అనుకరణ కేంద్రం, ట్రామా కేసులు, అత్యవసర వెంటిలేషన్స్, పీడియాట్రిక్స్, నియోనాటల్, ప్రసూతి, గైనకాలజీ, అనస్థీషియాలజీ, క్రిటికల్‌కేర్ యూనిట్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసుపత్రి చైర్మన్ లక్ష్మీనర్సింహారావు, డైరెక్టర్ సూర్య నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ అసిం అలీ, డాక్టర్ టి.అనిత, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

'ఇంటర్మీడియట్ ఫీజులను నియంత్రించాలి'

గణేశ్‌నగర్, ఏప్రిల్13: ఇంటర్మీడియట్ ఫీజులను ప్రభుత్వం నియంత్రించి విద్యార్థుల నుంచి కళాశాలలు అదనపు వసూలు చేయకుండా ప్రభుత్వం నిర్ణయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసి పెద్ది శ్రీధర్ రాజు కోరారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలలు విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంటర్మీడియట్ ఫీజులను నియంత్రించి ప్రభుత్వమే నిర్ణయించి అట్టి ఫీజులను బిసి, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ రూపంలో అందజేస్తు న్నారన్నారు. ఇంటర్ విద్యార్థుల ఫీజులు ప్రభుత్వం వెంటనే ఫీజులను నియంత్రించి నిర్ణయించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు.

'ప్రజా సమస్యల పరిష్కారమే బీజేపీ అజెండా'



డ్రైనేజీని పరిశీలిస్తున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 13: ప్రజా సమస్యల పరిష్కారమే బీజేపీ అజెండా అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ అన్నారు. తెలంగాణ సొమ్మును దోచుకుని ప్రజలను తెలివిలేనోళ్లంటావా అని కేటీఆర్‌ను ఆయన ప్రశ్నించారు. శనివారం నగరంలోని బాలాజి నగర్‌లో డ్రైనేజీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల కంటే ఆంధ్రావాళ్లే తెలివైన వారని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలివి ఉన్న వాళ్లెవరు బీఆర్ఎస్‌కు ఓటు వేయవద్దన్నారు. బాలాజీనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ, నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కవితను ఎందుకు అరెస్ట్ చేశారో ఏ ఆధారాలున్నాయో ఈడీ, సీబీఐని అడగాలని ఆయన అన్నారు. స్మార్ట్ సిటి నిధుల్లో అవకతవకలపై కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదో వినోద్‌కుమార్ సమాధానం చెప్పాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు.

అలంకారప్రాయంగా వారసంత

- రూ. 12 లక్షలతో నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

మానకొండూర్, ఏప్రిల్ 13: మండలంలోని అన్నారం గ్రామంలో రెండేళ్ల క్రితం ఉపాధిహామీ పథకం కింద నిర్మించిన వారసంత అలంకారప్రాయంగా మారింది. వారసంత పనులను ఉపాధిహామీ నుంచి రూ.9లక్షలు, గ్రామపంచాయతీ నిధులు రూ. 3లక్షలు వెచ్చించి పూర్తి చేశారు. గ్రామస్థులకు తాజా కూరగాయలు సరసమైన ధరలకు ఒకే ప్రదేశంలో లభించాలనే భావనతో వారసంత నిర్మాణం చేపట్టారు. అప్పటి ఎమ్మెల్యే రసమయి ఆరు నెలల క్రితం వారసంతను ప్రారంభించారు. అక్కడ విక్రయాలకు అధికారులు చర్య లు తీసు కోక పోవడంతో వినియోగంలోకి రావడం లేదు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చొరవ తీసుకొని వారసంతను వినియోగంలోకి తీసుకరావాలని గ్రామస్థులు కోరుతున్నారు.



అన్నారంలో నిరుపయోగంగా ఉన్న వారసంత

ఎమ్మార్పీఎస్ సదస్సుకు తరలిరావాలి

హుజూరాబాద్, ఏప్రిల్ 13: సిరిసిల్లలో ఆదివారం నిర్వహించే ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సదస్సుకు హుజూరాబాద్ నియో జకవర్గం నుంచి భారీ ఎత్తున తరలిరావాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నా యకుడు ఆర్ రామచంద్రం అన్నారు. శనివారం హుజూరాబాద్‌లో ఎమ్మార్పీ ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు, మహిళా సంఘాల నాయకులు అధిక మొత్తంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎం శ్రీనివాస్, టి వసంత్, బి రవీందర్, బి రాజ్‌కుమార్, మల్ల య్య, శేఖర్, సతీష్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయాలను అరికట్టాలి

హుజూరాబాద్, ఏప్రిల్ 13: పోలీసులు పకడ్బందీ చర్యల ద్వారా గంజాయి విక్రయాలను అరికట్టాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి గోస్కుల అజయ్ అన్నారు. హుజూరాబాద్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయి మత్తులో యువత బానిసలై రేవు పార్టీలకు సైతం వెళ్తున్నారన్నారు. యువత మత్తుకు బానిసవడంతో వారి ఆరోగ్యంతో పాటు కుటుంబం కూడా వీధి పాలవుతుందన్నారు. గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతేనే యువత భవిష్యత్తు బాగుపడుతుందని తెలిపారు. సమా వేశంలో రేణు ప్రసాద్, లక్ష్మణ్, రాందేర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

హుజూరాబాద్, ఏప్రిల్ 13: డివిజన్‌లో ఈ నెల 14నుంచి 20వరకు నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్‌ను శనివారం టౌన్ సీఐ బొల్లం రమేశ్‌టౌన్ సీఐ బొల్లం రమేశ్ హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ అగ్ని ప్రమాద సమయంలోనే కాకుండా వరదలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో కూడా ప్రజలకు సేవ చేసేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- సీపీఎం జమ్మికుంట జోన్ కార్యదర్శి శీలం అశోక్

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 13: హుజూరాబాద్ డివిజన్ పరిధిలో రేషన్ బియ్యం పంపిణీలో అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జమ్మికుంట జోన్ కార్యదర్శి శీలం అశోక్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. రేషన్ డీలర్లు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయి అధికారులు నామ మాత్రపు తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారని తెలిపారు. ప్రతి రేషన్ షాపులో తనిఖీలు చేపట్టాలన్నారు. రేషన్ షాపు నిర్వాహకులు లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరించి బడా వ్యాపారులకు, మిల్లర్లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటు న్నారని తెలిపారు. ప్రతి నెలా డీలర్లు ఇస్తున్న కాసులకు కక్కుర్తి పడి అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ రేషన్ బియ్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు.

ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బండి సంజయ్

శంకరపట్నం, ఏప్రిల్ 13: శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొయ్యడ కుమార్‌యాదవ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ సమక్షంలో శనివారం బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ బండి సంజయ్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ వార్డు సభ్యులు మాడ శ్రీకాంత్‌రెడ్డి, చిప్పబత్తిని శ్రావణ్‌కుమార్, కొత్త సారయ్యతో పాటు పలువురు ఉన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు ఎనుగుల అనిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, నాయకులు దండు కొంరయ్య, దొంగల రాములు, నరేందర్, సారయ్య, కొయ్యడ అశోక్, జైపాల్, శ్రీనివాస్, రాసమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా పొన్నం శ్రీనివాస్

చిగురుమామిడి, ఏప్రిల్ 13: బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా చిగురుమామిడికి చెందిన పొన్నం శ్రీనివాస్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధికార ప్రతినిధిగా నియమించిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు పార్టీ అభివృద్ధికి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించడానకి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

మానేరు విద్యార్థులకు మెడల్స్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 13: నగరంలోని మానేరు విద్యార్థులకు ఐఐటి హైదరాబాద్‌లో శనివారం మెడల్స్ సర్టిఫికెట్లు అందించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఐఐటి తరహా విద్యా విధానానికి మానేరు విద్యాసంస్థలు శ్రీకారం చుట్టాయన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఇలాంటి విద్యాబోధన ఎంతగానో దోహద పడుతుందన్నారు. పోటీ పరీక్షల్లో విజయం సాధించ డానికి పాఠశాల స్థాయిలోనే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 13: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని కిమ్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ పేర్యాల రవీందర్‌రావు అన్నారు. శనిఆరం కిమ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల వేడుకోలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు డిగ్రీ తర్వాత వృత్తి విద్యా పిజి కోర్సుల్లో చదివి అత్యున్న స్థాయిలో స్థిరపడాలన్నారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ర్యాంప్ వాక్ అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ సాకేత్ రామారావు, ప్రిన్సిపాల్ అర్జున్‌రావు, అధ్యాపకులు సంపత్‌కుమార్, తిరుపతి తదితరులుపాల్గొన్నారు.

సీతారామ కల్యాణానికి మేయర్‌కు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 13: స్థానిక భగత్‌నగర్ అంజనాద్రి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 17న జరిగే సీతారామ కల్యాణానికి హాజరు కావాల్సిందిగా మేయర్ యాదగిరి సునీల్‌రావుకు ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆహ్వానం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ క్యాంపు కార్యాల యంలో కరపత్రాన్ని మేయర్ సునీల్‌రావు ఆవిష్కరించారు.

నేడు చిన్న జీయర్‌స్వామిచే సమాశ్రయణములు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 13: కరీంనగర్ పద్మనాయ కల్యాణ మండపంలో జెట్, వికాసతరంగిణి ఆధ్వర్యంలో జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి చిన్న జీయర్‌స్వామిచే సమాశ్రయణములు (మంత్రోపదేశం) నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వహణ కమిటీ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. సమాశ్రయణం కాగోరు భక్తులు కల్యాణ మండపానికి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

నియామకం

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 13: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అబ్జర్వర్‌గా జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజొద్దీన్‌ని నియామకం చేశారు. ఈ మేరకు ఏఐసీసీ మైనార్టీ సెల్ వైస్ చైర్మన్ ఫరాహన్ ఆజ్మీ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల అబ్జర్వర్‌లను కూడా నియామకం చేశారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి

భగత్‌నగర్, ఏప్రిల్ 13: తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నగునూరులో ముందస్తు అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి క్యాట్ పరిక్షలో అత్యుత్తమ ప్రతిభ చాటిన రుచిత, ఎన్ రాణి, ఎస్‌కె పవిత్ర, విద్యార్థినులతో పాటు తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సమత, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ సుష్మ, లలిత, అశ్విని, డాక్టర్ కె లావణ్య, డాక్టర్ సుహాసిని పాల్గొన్నారు.

పూలే, అంబేద్కర్‌కు నివాళి

భగత్‌నగర్, ఏప్రిల్ 13: మహాత్మాజ్యోతిబాపూలే, డాక్టర్ బాబా సాహేబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో శనివారం ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ముందస్తుగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, జి రాజేశం, యు శ్రీనివాస్, జగాం రాజమల్లు, మారెళ్ల శ్రీలత, పున్నం రవి, శంర్, కదిరె రమేష్, గట్టు సతీష్, రచర్ల మల్లేశం, ముక్కెర బుజ్జమ్మ చౌదరి సంపత్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జయంతికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

గంగాధర, ఏప్రిల్ 13: గంగాధరలో ఆదివారం నిర్వహించే అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు రావాలని అంబేద్కర్ సంఘం నాయకులు శనివారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను ఆహ్వానించారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యేను కలిసిన నాయకులు ద్యావ శ్రీనివాస్, తాళ్ల శ్రీనివాస్, రాజయ్య, సంజీవ్ ఆయనకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

హుజూరాబాద్, ఏప్రిల్ 13: పట్టణంలోని పోలీస్ స్టేషన్, కోర్టు సముదాయంలో త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఉగాది క్యాలెండర్‌ను పోలీస్, కోర్టు సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, సతీష్, వంశీ, గోపి, కుమార్, రామస్వామి, పద్మ, శ్రీదేవి, చారి, బిందు, సరిత, తిరుపతి, జ్యోతి, శకుంతల పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

రామడుగు, ఏప్రిల్ 13 : మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో గల శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయంలో మహాగణపతి, పంచగవ్య పూజలు నిర్వహించారు. ఆదివారం స్వామివారి కల్యాణం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రామడుగు ఎంపీపీకి సన్మానం

రామడుగు, ఏప్రిల్ 13: రామడుగు ఎంపీపీగా ఎన్నికైన పూరెల్ల గోపాల్‌గౌడ్‌ను ఆలిండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రెడ్డి కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంజాల శ్రీనివాస్, గాజుల శ్రీనివాస్, నీలం లక్ష్మీరాజం, రాజమౌళి, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్స్య జయంతి వేడుకలు

శంకరపట్నం, ఏప్రిల్ 13: శంకరపట్నం మండలం కొత్తగట్టు శ్రీమత్స్యగిరీంద్రస్వామి దేవాలయంలో అర్చకులు మత్స్య జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైనా మత్స్యగిరీంద్రస్వామి పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

బూత్ అధ్యక్షుల సమ్మేళనానికి తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు

హుజూరాబాద్, ఏప్రిల్ 13: పార్లమెంట్ స్థాయి బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనానికి శనివారం హుజూరాబాద్ నుంచి బీజేపీ నాయకులు కరీంనగర్‌కు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో మాడ గౌతమ్‌రెడ్డి, గంగిశెట్టి రాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్యాలు

గన్నేరువరం, ఏప్రిల్ 13: మండలంలోని పారువెల్లలోని ఎంపీయూపీఎస్ పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో శనివారం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పెద్ది బీరయ్య అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు యాళ్ళ తార తదితరులు పాల్గొన్నారు.